ఈరోజు (29 జూలై) విలేఖర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ(యం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు. ఆ వివరాలను ప్రచురణార్థం విడుదల చేస్తున్నాం. –జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

**పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని**

**5న చలో పార్లమెంటు**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు**

**పోలవరం ప్రాజెక్టు పునరావాస కమిటీతో సిఎం చర్చించాలి**

**వాగ్దానానికి భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి**

పోలవరం నిర్వాసితుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని, పునరావాసం కల్పించకుండా కాఫర్ డ్యాం పూర్తి చేయడం వల్ల మన్యంలో 80 గ్రామాల్లో ప్రజలు నీటమునిగారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ ఆగస్టు 5న చలో పార్లమెంటు నిర్వహించనున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు తెలిపారు. గురువారం విజయవాడలోని మాకినేని బవసపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. కాఫర్ డ్యాం పూర్యిచేయడం వల్ల 80 గ్రామాల్లోకి నీరొచ్చి చేరిందని, గిరిజనులు మరో గత్యంతరం లేక కొండలపైకి వెళుతున్నారని తెలిపారు. కొంతమంది 40, 50 కిలోమీటర్ల దూరం నడిచి బయటకు వెళుతున్నారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న వారికి సరైన సదుపాయాలు లేక, కనీసం కిరోసిన్ కూడా అందడం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించాయని తెలిపారు. 41.15 కాంటూరు లెవర్ వరకూ ఉన్న నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం ఇచ్చిన తరువాతే తరలించాలని డిమాండు చేశారు. ఈలోపు తరలించొద్దని హైకోర్టు కూడా ఆదేశించిందని గుర్తు చేశారు. దీన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వం ప్రజలను పట్టించకోకుండా నీటిని నిలబెట్టి ఆయా గ్రామాలను ముంచేసే పరిస్థితి కల్పించిందన్నారు. గోదావరికి జులై, ఆగస్టులో వరదలొస్తాయని ఈఏడాది జులై మొదటి నుండి వరద తాకిడి మొదలైందని తెలిపారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం నిర్వాసితుల బాధ్యత తనది కాదనే విధంగా వ్యవహరిస్తూ ఏకపక్షంగా ముందుకు పోతోందని విమర్శించారు. 2014 అంచనాల ప్రకారమే పునరావాస, పునర్నిర్మాణం అంచనాల మొత్తాన్ని ఇస్తామని చెప్పడం కేంద్ర ప్రాజెక్టుగా ప్రకటించి ఇప్పుడు తమకు సంబంధం లేదనే విధంగా వ్యవహరించడం అన్యాయమని పేర్కొన్నారు. దీన్ని ప్రశ్నించి న్యాయంగా నిధులను రాబట్టుకునే విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తగినంత ఒత్తిడి తేవడం లేదని విమర్శించారు. ప్రజలను మాత్రం నీళ్లలో ముంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఇదే పరిస్థితి ఉందని, అయినా అనుభవం ప్రభుత్వం పాఠాలు నేర్చుకోకపోవడం క్షంతవ్యం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి నిర్వాసితులను ఆదుకోవాలని, వారికి నిత్యావసరాలు వెంటనే అందజేయాలని కోరారు. పనులు పోయిన వారికి నిత్యావసరాలు ఇచ్చి వరద సహాయం చేయాలన్నారు. పునవాస ప్యాకేజీకి అమలుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని తెలిపారు. కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చేందుకు ప్రజల సహకారం పొందడానికి వీలుగా సిఎం ప్రాజెక్టు పునరావాస కమిటీతో చర్చించాలని సూచించారు. దీనిపై పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కమిటీతో కలిసి శుక్రవారం గరవ్నర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు. ఆగస్టు 5న ఢిల్లీ వెళ్లి చలో పార్లమెంటు కార్యక్రమం చేపడతామన్నారు.

= = = =